ఆంధ్రజ్యోతి ప్రవాస

# డాలస్‌లో గాంధీ మెమోరియల్‌ను సందర్శించిన మంత్రి గంటా



**డాలస్, టెక్సాస్, మే 29, 2018:** అమెరికాలో అత్యంత పెద్దదయిన మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను పలువురు తెలుగు రాష్ట్రాల ప్రముఖులు సందర్శించారు. డల్లాస్‌లో ఉన్న మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను సందర్శించి పుష్ప గుచ్చాలతో జాతిపితకు ఘనంగా నివాళులు అర్పించారు. గతంలో తాను ఓసారి ఇక్కడకు వచ్చాననీ, ప్రతియేటా మెరుగులు దిద్దుకుంటూ సుందర ప్రాంతంగా గాంధీ మెమోరియల్ రూపుదిద్దుకోవడం సంతోషదాయకమని ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ గాంధీ మెమోరియల్‌ను ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేసిన డాక్టర్ ప్రసాద్ తోటకూరకు, బృంద సభ్యులకు, సిటీ అధికారులకు, స్థానిక ప్రజలకు ఆయన అభినందలు తెలియజేశారు.

గాంధీజీ ఆశయాలు, త్యాగనిరతి యువతకు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పెద్ది రెడ్డి అన్నారు. తాను తొలిసారిగా డల్లాస్‌లోని గాంధీ మెమోరియల్‌ను సందర్శించానని తెలిపారు. ఈ పార్కును అభివృద్ధి చేయడంలో సంస్థ ఛైర్మన్ డా. ప్రసాద్ తోటకూర, బృంద సభ్యులు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు.

గుంటూరు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ పాత్తూరి నాగభూషణం మాట్లాడుతూ.. భారత్‌లో జన్మించి, శాంతి, త్యం, అహింస మార్గాలను అనుసరిస్తూ గాంధీజీ ప్రపంచ నేతగా ఎదిగారన్నారు. కేవలం భారతీయులే కాకుండా ఇతర దేశాలకు చెందిన ప్రజలు కూడా ఈ గాంధీ మెమోరియల్‌ను సందర్శించడం విశేషమన్నారు. ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిథి కోమటి జయరాం మాట్లాడుతూ.. పచ్చని చెట్లతో, చక్కని నీటి వనరులతో ఈ గాంధీ మెమోరియల్‌ను అత్యంత సుందర పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దిన తీరు అభినందనీయమన్నారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ప్రత్యేక శ్రద్ధతో ఈ గాంధీ మెమోరియల్‌ను సందర్శించి జాతిపితకు నివాళులర్పించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నేతలకు, స్థానిక ప్రముఖులైన వెంకట్ అబ్బారు, మురళి వెన్నం, వినోద్ ఉప్పు తదితరులందరికీ చైర్మన్ డా. ప్రసాద్ తోటకూర ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

